

ఎ.రామలింగం, కేఎం కోదండమ్, షణ్ముగసుందరం, తిరువిడమ్, సూర్యకాంతన్, పూర్ణచంద్రన్

9మంది తమిళ పండితులకు సాహితీ పురస్కారాలు

చెన్నై,జనవరి25(ఆంధ్రజ్యోతి): తమిళ భాషాభివృద్ధికి విశిష్ట సేవలందించిన తొమ్మిదిమంది పండితులకు రాష్ట్రప్రభుత్వం 'ఇలక్కియమామణి' పేరుతో సాహితీ పురస్కారాలను ప్రకటించింది. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాకా అంటే మూడేళ్లకుగాను ప్రతియేటా ముగ్గురు చొప్పున తమిళపండితులను ఈ పురస్కారాలకు ఎంపిక చేశారు. అంతేకాకుండా సంప్రదాయిక తమిళం, పరిశోధనాత్మక తమిళం, సృజనాత్మక తమిళం అంటూ మూడురకాలుగా తమిళభాషాభివృద్ధికి అందించిన సేవలకు గాను ఈ పురస్కారాలను ప్రభుత్వం ప్రకటించింది. ఆ మేరకు 2022 సంవత్సరానికిగాను కళ్లకురిచ్చి జిల్లాకు చెందిన అరంగ రామలింగం (సంప్రదాయిక తమిళం), విరుదనగర్ జిల్లాకు చెందిన కేఎం కోదండం (పరిశోధనాత్మక తమిళం), కోయంబత్తూరుకు చెందిన సూర్యకాంతన్ (సృజనాత్మక తమిళం) ఈ పురస్కారాలను అందుకోనున్నారు. ఇదేవిధంగా మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలను సందర్భంగా ప్రత్యేక ఎంపికగా మరో ముగ్గురు తమిళ పండితులకు కూడా ఈ పురస్కారాలను ప్రకటించారు. ఆ మేరకు నీలగిరి జిల్లాకు చెందిన మణి అర్జునన్ (సంప్రదాయిక తమిళం), తిరువారూరు జిల్లాకు చెందిర ఆర్.తిరువిడమ్ (పరిశోధనాత్మక తమిళం), చెన్నైకి చెంది కే.పూర్ణచంద్రన్ (సృజాత్మక తమిళం) ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. ఇక 2023 సంవత్సరానికిగాను కడలూరు జిల్లాకు చెందిన జె.మాణిక్కవాచగం (సంప్రదాయిక తమిళం), తిరునల్వేలి జిల్లాకు చెందిన ఎస్. షణ్ముగ సుందరం (పరిశోధనాత్మక తమిళం), శివగంగ జిల్లాకు చెందిన ఇలక్కియా నటరాజన్(సృజనాత్మక తమిళం)ఈ పురస్కారాలను స్వీకరించనున్నారు. ఈ పురస్కారం ప్రకారం రూ.5లక్షల నగదు, స్వర్ణపతకం, ప్రశంసాపత్రం అందజేసి సత్కరించనున్నారు.



వడపళని మురుగన్ ఆలయంలో భక్తుల రద్దీ



తిరుప్పరంగుండ్రం క్షేత్రంలో భక్తుల సందడి

హరోం హర

వైభవంగా తైపూస ఉత్సవాలు

ఆలయాలకు పోటెత్తిన భక్తజనం

ప్యారీస్, జనవరి 25: తైపూస పర్వదినం సందర్భంగా రాష్ట్రంలోని సుబ్రమణ్యస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తమిళుల ఆరాధ్యదైవం సుబ్రమణ్యస్వామి కొలువుదీరిన తిరుచెందూర్, పళని, స్వామిమలై, మరుదమలై, తిరుప్పరంగుండ్రం, వడపళని, కందకోట్టం తదితర దివ్యక్షేత్రాల్లో గురువారం తైపూసం వేడుకలను వైభవంగా నిర్వహించారు. రాష్ట్రంలో కుమార స్వామి కొలువుదీరిన ఆరు దివ్యక్షేత్రాల్లో ద్వితీయ క్షేత్రంగా విలసిల్లుతున్న తూత్తుకుడి జిల్లాలోని తిరుచెందూర్‌లో ఉదయం సముద్ర స్నానాల అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు స్వామిని దర్శనం చేసుకుని పులకించిపోయారు. తిరునల్వేలి, తూత్తుకుడి, తెన్‌కాశి, కళ్లకుర్చి తదితర జిల్లాల నుంచి భక్తులు వారంరోజులు నియమనిష్టలతో వ్రతమాచరించి, కావళ్లు మోసుకుంటూ పాదయాత్రగా ఈ క్షేత్రానికి చేరుకున్నారు. ఆలయ పూజారులు వేకువజామున ఒంటిగంటకు ఆలయాన్ని తెరచి అభిషేకాలు, ఉదయమార్తాండ సేవలు, దీపారాధన నిర్వహించారు. ఆ తర్వాత కడలి తీరంలో అస్త్రదేవ స్వామివారి తీర్థవారి వేడుకల అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఉచ్చికాల దీపారాధన, సాయంత్రం సంధ్యాకాల దీపారాధన, రాత్రి 7.30 గంటలకు ఏకాంతం దీపారాధన, 8 గంటలకు శయనసేవ దీపారాధన పూజలు నిర్వహించారు. ఉత్తర రథవీధిలోని తైపూస మండపంలో ఉత్సవర్లు ప్రత్యేక అలంకరణతో భక్తులకు కనువిందు చేశారు. అనంతరం మయూర వాహనంలో స్వామివారిని పురవీధుల్లో ఊరేగించారు.

తిరుప్పరంగుండ్రంలో...

మురుగన్ కొలువైన ఆరుదివ్యక్షేత్రాల్లో మొదటిదైన మదురైజిల్లా తిరుప్పరంగుండ్రంలో తైపూస ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు. తిరుప్పరంగుండ్రం పర్వతం శివలింగ ఆకారంలో ఉండడంతో ఈ క్షేత్రంలో తిరువణ్ణామలైలాగే భక్తులు పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదక్షిణలో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి శరీరానికి, నోటికి శూలాలు గుచ్చుకొని తరలివచ్చిన భక్తులతో ఈ ప్రాంతం కిటకిటలాడింది. కొంతమంది భక్తులు పక్షి కావళ్ల పేరిట వీపునకు కొక్కీలు గుచ్చుకొని వేలాడుతూ నిర్వహించిన ప్రదర్శన అందర్నీ ఆకట్టుకుంది. భారీ క్రేన్ కొసలో వేలాడుతూ 'హరోం హర మురుగయ్య' అంటూ నినాదాలు చేశారు.

పళనిలో...

దిండుగల్ జిల్లా పళని కొండపై వెలసిన దండాయుధపాణి స్వామి ఆలయంలో వల్లి, దేవసేన సమేత స్వామికి తెల్లవారుజామున 1గంటకే ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. దేశంలోని పలు రాష్ట్రాలు, వివిధ దేశాల నుంచి భక్తులు తైపూసం వేడుకలకు తరలివచ్చారు. క్యూలైన్ల ద్వారా భక్తులను దర్శనానికి అనుమతించారు. పలు హిందూ సంస్థలు మజ్జిగ, తాగునీరు, అన్నదాన కార్యక్రమాలు చేపట్టాయి. కొండపైకి వెళ్లే మెట్ల దారి, గజమార్గం ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్వామివారికి ప్రత్యేక దీపారాధనలు నిర్వహించి, రాత్రికి బంగారు అశ్వ వాహనంలో మాడవీధుల్లో ఊరేగించారు. అలాగే, పళముదుచోలై, స్వామిమలై క్షేత్రాల్లో కూడా తైపూస ఉత్సవాలను వైభవంగా నిర్వహించారు.



కావళ్లతో పళనికి భక్తుల పాదయాత్ర

తిరుత్తణిలో...

తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణిలో ప్రసిద్ధిచెందిన సుబ్రమణ్యస్వామి ఆలయంలో తైపూస వేడుకల సందర్భంగా వేకువజామున మూలవర్లకు అభిషేక పూజలు జరిపి, స్వర్ణ, వజ్రాభరణాలతో సుందరంగా అలంకరించారు. కావడి మండపంలో షణ్ముగస్వామికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. బంగారు కవచం, స్వర్ణ త్రిశూలం చేతబూని వల్లి, దేవసేన సమేత పుష్ప అలంకారంలో భక్తులకు స్వామివారు దర్శనమిచ్చారు. రాష్ట్రంలోని పలు జిల్లాలు, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

వడపళనిలో...

వడపళని మురుగన్ ఆలయంలో తెల్లవారుజామున 4 గంటలకు ఆలయాన్ని తెరచి, 4.30 గంటలకు ప్రత్యేక పూజలు ప్రారంభించారు. 5 గంటల నుంచి ఉదయం 9 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతించారు. వందలాది మంది భక్తులు కావళ్లతో, శరీరానికి శూలాలు గుచ్చుకొని స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. వ్రతం చేపట్టిన భక్తులు, వృద్ధులు, గర్భిణులు, చంటి పిల్లలతో వచ్చే మహిళలను పశ్చిమ గోపురం దారిలో దర్శనానికి అనుమతించారు. అలాగే, క్షీర కలశాలతో వచ్చిన భక్తులను దక్షిణ గోపురం దారిలో అనుమతించారు. మధ్యాహ్నం 1 గంటకు శాస్త్రోక్తంగా క్షీరాభిషేకం నిర్వహించారు. భక్తులు సమర్పించిన పాలతో సాయంత్రం 5 గంటల వరకు సుబ్రమణ్యస్వామికి అభిషేకాలు కొనసాగించారు. అనంతరం రాత్రి 8.30 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని అందంగా అలంకరించి రజత మయూర వాహనంలో మాడవీధుల్లో ఊరేగించారు. అలాగే, ప్యారీస్ రాశప్పచెట్టి వీధిలో ఉన్న కందకోట్టం మురుగన్ ఆలయంలో తెల్లవారుజామున 5 నుంచి ఉదయం 9 గంటల వరకు అభిషేకాలు, పూల అలంకార సేవలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో వల్లి, దేవసేన సమేత మురుగ పెరుమాళ్‌ను ఆశీనులను చేసి పురవీధుల్లో ఊరేగించారు. కుండ్రత్తూర్ మురుగన్ ఆలయంలో నిర్వహించిన వేడుకలకు వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకుల తరపున 15 వేల లడ్డు ప్రసాదాలు, అన్నదానం పంపిణీ చేశారు. అలాగే, భక్తుల సౌకర్యార్థం తాంబరం, పోరూర్, పూందమల్లి, పల్లావరం తదితర ప్రాంతాల నుంచి ప్రత్యేక సిటీ బస్సులు నడిపారు. ఆలయ ప్రాంగణంలో 108 కిలోల చందనంతో రూపొందించిన స్వామివార్ల విగ్రహాలు భక్తులకు కనువిందు చేశాయి.



ఆనందకుమార్‌రెడ్డిని అభినందిస్తున్న ఏజే శేఖర్, శ్రీకృష్ణ

టీటీడీ సలహామండలి ఉపాధ్యక్షుడిగా ఆనందకుమార్‌రెడ్డి ప్రమాణం

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల్లోని టీటీడీ ఆలయాల సమాచార కేంద్ర సలహామండలి ఉపాధ్యక్షుడిగా కె.ఆనందకుమార్‌రెడ్డి గురువారం ప్రమాణ స్వీకారం చేశారు. గతేడాది మధ్యలో సలహామండలి అధ్యక్షుడిగా ఏజే శేఖర్‌ను నియమించిన ఏపీ ప్రభుత్వం.. గత నవంబరు 21వ తేదీన ఉపాధ్యక్షులను, సభ్యులను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఆ జాబితాలో ఆనందకుమార్‌రెడ్డి పేరు వున్నప్పటికీ ఆయన విదేశీయానంలో వుండడంతో పదవీబాధ్యతల స్వీకారం చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన టి.నగర్, వెంకటనారాయణ రోడ్డులో వున్న శ్రీవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం.. అధ్యక్షుడు ఏజే శేఖర్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన్ని సలహామండలి మాజీ అధ్యక్షుడు నూతలపాటి శ్రీకృష్ణ, సభ్యులు బి.మోహన్‌రావు, అనిల్‌కుమార్‌రెడ్డి, రంగారెడ్డి, రవి సన్నారెడ్డి, రాధాకృష్ణ, మాజీ సభ్యులు, తెలుగు ప్రముఖులు వి.కృష్ణారావు, ఎరుకలయ్య తదితరులు అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. ఆనందకుమార్‌రెడ్డి గతంలో పలుమార్లు సలహామండలి అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షుడిగా వ్యవహరించారు. ఆలయ అభివృద్ధి కోసం పలు కార్యక్రమాలు చేపట్టారు. కాగా ప్రస్తుత సలహామండలిలో అధ్యక్షుడితో కలిపి మొత్తం 46 మంది సభ్యులు వున్న విషయం తెలిసిందే.



సమావేశంలో ప్రస్తుత, మాజీ సభ్యులు

డీఎంకేకు 23.. కాంగ్రెస్‌కు 7 సీట్లు?

డీఎంకే కూటమిలో కొలిక్కొచ్చిన సీట్ల సర్దుబాటు !



చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డీఎంకే కూటమిలో సీట్ల సర్దుబాటు కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో 23 నియోజకవర్గాల్లో పోటీ చేయడానికి డీఎంకే సన్నాహాలు చేసుకుంటోంది. ఈనెల 28న సీట్ల కేటాయింపులపై కాంగ్రెస్ ప్రతినిధులు డీఎంకేతో భేటీ కానున్నారు. ఆ సందర్భంగా కాంగ్రెస్‌కు ఏడు లోక్‌సభ నియోజకవర్గాలను కేటాయించనున్నట్లు డీఎంకే సీనియర్ నాయకులు చెబుతున్నారు. ప్రస్తుతం అన్నా అరివాలయంలో ఎన్నికల మేనిఫెస్టో తయారీ కంటే ముందుగా మిత్రపక్షాలకు వీలైనంత త్వరగా సీట్ల కేటాయింపులు జరగాలని డీఎంకే అధ్యక్షుడు, రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ చర్చల కమిటీ నేతలకు తెలిపారు. రెండు రోజులుగా ఈ విషయమై పార్టీ సీనియర్ నేతలు జరిపిన చర్చల్లో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపునకు సంబంధించి ఓ నిర్ణయానికి వచ్చారని చెబుతున్నారు. ఆ మేరకు డీఎంకే 23 చోట్ల పోటీ చేయాలని, కాంగ్రెస్‌కు ఏడు నియోజకవర్గాలు, డీపీఐకి రెండు సీట్లు, సీపీఐ, సీపీఎంకు తలా రెండు సీట్లు, ఎండీఎంకే, కొంగునాడు మక్కల్ కట్చి, ముస్లింలీగ్ పార్టీలకు తలా ఒక సీటును కేటాయించాలని డీఎంకే అధిష్టానవర్గం భావిస్తోంది. కూటమిలో కొత్తగా చేరనున్న కమల్ హాసన్ నాయకత్వంలోని మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం)కు కూడా ఒక సీటు మాత్రమే కేటాయించే అవకాశాలున్నాయని తెలిసింది. ఎండీఎంకే, ఎంఎన్ఎం సహా నాలుగు పార్టీలు డీఎంకే గుర్తు ఉదయసూర్యుడి గుర్తుపైనే పోటీ చేస్తారని తెలిసింది. ఈ ప్రాతిపదికగానే మిత్రపక్షాలతో చర్చలు జరపాలని పార్టీ ప్రముఖులకు స్టాలిన్ ఆదేశించారు.

మూడు సీట్ల కోసం ఎంఎన్ఎం పట్టు...

గత లోక్‌సభ ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన ఎంఎన్ఎం ఈ సారి డీఎంకేతో పొత్తు కుదుర్చుకుని పోటీ చేయనుంది. ఈరోడ్ శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి ఈవీకేఎస్ ఇళంగోవన్‌కు మద్దతుగా కమల్‌హాసన్ ప్రచారం చేయడం ఎంఎన్ఎం డీఎంకే కూటమిలో చేరినట్లు పరోక్షంగా ప్రకటించినట్లయింది. ఈ నేపథ్యంలోనే డీఎంకే అధిష్టానంపై ఒత్తిడి చేసి ఎలాగైనా మూడు సీట్లను రాబట్టాలని కమల్‌హాసన్ పావులు కదుపుతున్నారు. ఈ విషయమై ఎంఎన్ఎం సీనియర్ నాయకుడొకరు మాట్లాడుతూ... డీఎంకే కూటమిలో చేరటం వల్ల రెండు పార్టీలు లబ్ధిపొందుతాయని చెప్పారు. అంతే కాకుండా డీఎంకే కూటమి తరపున కమల్‌హాసన్ ప్రచారం చేస్తే కూటమి గెలుపు సునాయాసమవుతుందని తెలిపారు. కమల్ డీఎంకే కూటమికి అదనపు ఆకర్షణగా నిలుస్తారని చెప్పారు. ఒకే వేళ మూడు సీట్లు లభించకపోతే యధావిధిగా ఒంటరిగా పోటీ చేయడమే మంచిదని తాము కమల్‌కు హితవు పలికినట్లు ఆయన పేర్కొన్నారు.

అన్నాడీఎంకే మేనిఫెస్టో కమిటీ భేటీ

అందరికీ ఆమోదయోగ్యంగా రూపొందిస్తాం : జయకుమార్



సమావేశంలో పాల్గొన్న నేతలు

ప్యారీస్, జనవరి 25: పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష అన్నాడీఎంకే ఎన్నికల మేనిఫెస్టో కమిటీ భేటీ అయింది. స్థానిక రాయపేటలో ఉన్న అన్నాడీఎంకే ప్రధాన కార్యాలయం ఎంజీఆర్ మాళిగైలో గురువారం ఉదయం ఈ సమావేశం జరిగింది. ఇందులో మాజీ మంత్రులు నత్తం విశ్వనాథన్, సి.పొన్నయ్యన్, సెమ్మలై, వలర్మతి, ఓఎస్ మణియన్, ఆర్బీ ఉదయకుమార్, డి.జయకుమార్, మాజీ డిప్యూటీ స్పీకర్ పొల్లాచ్చి జయరామన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల మేనిఫెస్టోలో చోటుచేసుకోవాల్సిన అంశాలు, ప్రజలకు చేరవేయాల్సిన సమాచారం, కార్మికుల సంఘాలు, ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, పారిశ్రామికవేత్తలు, సీనియర్ సిటిజన్ల అభిప్రాయాలను సేకరించడంపై చర్చించారు. సమావేశం అనంతరం జయకుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజలకు లబ్ధిచేకూర్చే విధంగా తమ పార్టీ పార్లమెంటు ఎన్నికల మేనిఫెస్టో ఉంటుందని అన్నారు. అన్నాడీఎంకే కూటమిలో ఎవరైనా చేరవచ్చుని, పొత్తులు, సీట్ల సర్దుబాటుపై త్వరలోనే పార్టీ అధిష్ఠానం ప్రకటిస్తుందన్నారు. తమ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో ఒక సూపర్ హీరోగా, అందరి ఆమోదయోగ్యంగా ఉంటుందని ఆయన వివరించారు.

రాష్ట్రానికి 8 పద్మలు



వైజయంతిమాల - పద్మసుబ్రమణ్యం - విజయకాంత్

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి 8 పద్మ అవార్డులు వరించాయి. 2023 సంవత్సరానికి గానూ 2 పద్మ విభూషణ్, ఒక పద్మభూషణ్, మరో ఐదుగురికి పద్మశ్రీ అవార్డులు ఇవ్వనున్నట్లు రాష్ట్రపతి ద్రౌపదిముర్ము గురువారం ప్రకటించారు. వైజయంతిమాల (కళారంగం), ప్రముఖ నర్తకి పద్మసుబ్రమణ్యంలకు పద్మ విభూషణ్, డీఎండీకే అధినేత స్వర్గీయ విజయకాంత్‌కు పద్మ భూషణ్ ప్రకటించారు. అలాగే ఎం.బద్రప్పన్(కళారంగం), జోత్స్న చినప్ప(క్రీడా రంగం), జో డిక్రూజ్(విద్య), జి.నాచియార్ (వైద్యరంగం), శేషంపట్టి టి.శివలింగమ్ (కళారంగం)లకు పద్మశ్రీ వరించింది. ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవానికి ఇచ్చే ఈ అవార్డులు 2023 సంవత్సరానికి వీరికి ప్రకటించారు.

బాలిక చిత్రవధ వ్యవహారం

డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలి అరెస్ట్

పెరంబూర్, జనవరి 25: ఇంట్లో పనిచేస్తున్న బాలికను చిత్రవధ చేసిన వ్యవహారంలో డీఎంకే ఎమ్మెల్యే కుమారుడు, కోడలిని పోలీసులు అరెస్ట్‌చేశారు. స్థానిక పల్లావరం డీఎంకే ఎమ్మెల్యే కరుణానిధి కుమారుడు ఆండ్రో మదివానన్, కోడలు మెర్లినాలు తిరువాన్మియూర్ సౌత్ అవెన్యూ ప్రాంతంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నారు. ఇంట్లో పనిచేసేందుకు గత ఏడాది రేఖ(18)ను తీసుకొచ్చారు. రేఖకు వేతనం సక్రమంగా ఇవ్వడం లేదని సమాచారం. ఈ విషయం అడిగిన బాలికను ఆండ్రో మదివానన్, మెర్లినా చిత్రహింసలు పెట్టినట్లు ఆరోపణలున్నాయి. వారి చిత్రవధతో బాలిక ముఖం, కాళ్లు, చేతులపై కలిగిన గాయాలతో కూడిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై బాధిత బాలిక నీలాంగరై మహిళా పోలీస్‌స్టేషన్లన్‌లో ఫిర్యాదుచేసింది. ఈ వ్యవహారంపై ఆండ్రో మదివానన్, మెర్లినాలపై చిత్రహింసల చట్టం సహా ఐదు సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదుచేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టిన సమయంలో ఆ ఇరువురూ అదృశ్యమయ్యారు. వీరి ఆచూకీ కనుగొనేందుకు మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటయ్యాయి. వీరు దాఖలుచేసిన ముందస్తు బెయిలు పిటిషన్ బుధవారం హైకోర్టు తోసిపుచ్చింది. ఈ నేపథ్యంలో, ఆంధ్రాలో తలదాచుకున్న ఇద్దర్నీ ప్రత్యేక బృందం పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు.



సమాచార ధ్వని

రేపటి నుంచి పక్షుల గణన

ఐసిఎఫ్, జనవరి 25: రాష్ట్రంలో 38 జిల్లాల్లో పక్షుల గణన శని, ఆదివారాల్లో జరగనుంది. నీటి, నేల పక్షులు అని రెండు విభాగాలుగా గణన చేపట్టనున్నారు. గత ఏడాది 600లకు పైగా ప్రాంతాల్లో నిర్వహించిన సర్వేలో 410 జాతులకు చెందిన 4.66 లక్షల పక్షులున్నట్లు గుర్తించారు. ఈ ఏడాది నీటి పక్షుల గణన ఈ నెల 27,28 తేదీల్లో, నేల పక్షుల గణన మార్చి 2, 3 తేదీల్లో జరుగనుందని అధికారులు తెలిపారు.

రవాణా సంస్థ డైరెక్టర్ల బదిలీ

ఐసిఎఫ్, జనవరి 25: ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇళంగోవన్ సహా ముగ్గుర్ని బదిలీ చేస్తూ ఆ శాఖ కార్యదర్శి ఫణీంద్రరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఇళంగోవన్ తిరునల్వేలి ప్రభుత్వ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గాను, కుంభకోణం రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మోహన్ ఎక్స్‌ప్రెస్ రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గాను, తిరునల్వేలి రవాణా సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ మహేంద్రకుమార్ కుంభకోణం రవాణా సంస్థకు బదిలీ అయ్యారు.

నిమజ్జనానికి రుసుము వసూలు

ఐసిఎఫ్, జనవరి 25: వినాయక విగ్రహాల నిమజ్జనకు ముందుగానే రుసుము వసూలుచేయాలని జిల్లా కలెక్టర్లకు దక్షిణ మండల గ్రీన్ ట్రిబ్యునల్ ఉత్తర్వులు జారీచేసింది. జలవనరుల కాలుష్యాన్ని అడ్డుకొనేందుకు విగ్రహాల నిమజ్జనం సమయంలో రుసుము వసూలుచేసేలా చర్యలు చేపట్టాలని పుదుపేటకు చెందిన హరిహరన్ ట్రిబ్యునల్‌లో పిటిషన్ దాఖలుచేశారు. విచారించిన ట్రిబ్యునల్... సముద్రాలు, జలాశయాల్లో వినాయక విగ్రహాలు నిమజ్జనంలో ఏర్పడే సమస్యలు పరిష్కరించేలా, ప్రభుత్వ రెవెన్యూ, పర్యావరణ శాఖల అధికారులు వినాయకచవితికి ఆరునెలల ముందు సమావేశం కావాలని, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్‌తో తయారుచేసే విగ్రహాలు నిషేధించాలని సూచించడంతో పాటు నిమజ్జన సమయంలో రుసుము వసూలుకు కలెక్టర్లు చర్యలు చేపట్టాలని పేర్కొంది.

పురస్కారం ఎంపిక కమిటీ

ఐసిఎఫ్, జనవరి 25: ఉత్తమ ప్రభుత్వ పాఠశాలలకు ఆచార్య అన్బళగన్ పురస్కారం అందజేసేందుకు ప్రభుత్వం ఎంపిక కమిటీని ప్రకటించింది. బోధనా విధానం, ఉపాధ్యాయుల నైపుణ్యాభివృద్ధి, పాఠశాలలో మౌలిక సదుపాయాలు వంటి ఆధారంగా ఎంపిక చేసే ఉత్తమ పాఠశాలలకు ప్రభుత్వం ఈ పురస్కారం అందజేస్తోంది. ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత, మహోన్నత పాఠశాలలు అని మొత్తం నాలుగు రకాల పాఠశాలలను ఎంపిక చేసేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి ఎంపిక కమిటీలు ఏర్పాటయ్యాయి.

ఎగుమతి, దిగుమతులపై శిక్షణ

ఐసిఎఫ్, జనవరి 25: రాష్ట్రప్రభుత్వ ఔత్సాహిక పారిశ్రామిక అభివృద్ధి సంస్థ ప్రాంగణంలో ఎగుమతి, దిగుమతులపై ప్రత్యేక శిక్షణ జరుగనుంది. స్థానిక ఈకాట్టుతాంగల్‌లో ఉన్న ఈ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి 2వతేది వరకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహించే శిక్షణలో ఎగుమతి మార్కెట్ అవసరాలు, ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన చట్టాలు, విదేశీ మారకద్రవ్యం, బీమా వంటి వాటిపై నిపుణులు సలహాలు ఇవ్వనున్నారు. శిక్షణలో 18 ఏళ్లు పూర్తయిన టెన్త్ ఉత్తీర్ణులైన వారు పాల్గొనాలి. వివరాలకు www.editn.in అనే వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

28న వెయిట్ లిఫ్టింగ్ పోటీలు

ఐసిఎఫ్, జనవరి 25: జిల్లాస్థాయి వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు తిరువొత్తియూర్‌లో ఈనెల 28వ తేది జరుగనున్నాయి. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాల్లో ఉదయం 7 గంటలకు ఈ పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆసక్తి ఉన్న వారు 9841315735 అనే నెంబరు సంప్రదించాలని నిర్వాహకులు తెలిపారు.

12 నుంచి ప్లస్ టూ ప్రాక్టికల్ పరీక్షలు

ఐసిఎఫ్, జనవరి 25: రాష్ట్రంలో ప్లస్ టూ విద్యార్థుల ప్రాక్టికల్ పరీక్షలు ఫిబ్రవరి 12 నుంచి 17వ తేది వరకు జరుగనున్నాయి. ఈ విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు మార్చి 1 నుంచి 22వ తేది వరకు, ప్లస్ వన్ విద్యార్థులకు మార్చి 4 నుంచి 25వ తేది వరకు జరుగనున్నాయి. ప్రాక్టికల్ పరీక్షలు ప్లస్ వన్ విద్యార్థులకు ఫిబ్రవరి 19 నుంచి 24 వరకు జరుగనున్నాయని ప్రభుత్వ పరీక్ష శాఖ తెలిపింది.

నేడు మ్యూజియం మూసివేత

ఐసిఎఫ్, జనవరి 25: ఎగ్మూర్‌లో ఉన్న ప్రభుత్వ మ్యూజియం గణతంత్ర దినోత్సవం సందర్భంగా శుక్రవారం మూసివేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గ్రూప్-4 అభ్యర్థులకు ఉచిత తరగతులు

ఐసిఎఫ్, జనవరి 25: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పరీక్షకు సిద్ధమయ్యే చెన్నై జిల్లాకు చెందిన అర్హులైన అభ్యర్థులకు ఉచిత శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ తెలిపారు. స్థానిక గిండిలో ఉన్న ఎంప్లాయ్‌మెంట్ శిక్షణ కేంద్రంలో ఈ నెల 29 నుంచి గ్రూప్-4 శిక్షణా తరగతులు జరుగనున్నాయని, టెన్త్ చదివిన వారు పాల్గొనాలని తెలిపారు. ఇతర వివరాలకు decgc.chennai@gmail.com ఈ-మెయిల్ సంప్రదించవచ్చు.

నగరంలో కొత్త ఓటర్లతో మోదీ భేటీ

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన కొత్త ఓటర్లతో ప్రధాని నరేంద్రమోదీ వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ముచ్చటించారు. జాతీయ ఓటర్ల దినం సందర్భంగా నగరంలోని ఎగ్మూరు, హార్బర్, అర్కేనగర్, థౌజెండ్‌లైట్స్ సహా 22 ప్రాంతాల్లో భారీ సైజ్ ఎల్ఈడీ స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు. ఆ సందర్భంగా మోదీ ఓటర్ల జాబితాలో కొత్తగా పేర్లు నమోదు చేసుకున్న ఓటర్లతో కబుర్లాడారు. ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని హితవు పలికారు.

రిపబ్లిక్ వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

పెరంబూర్, జనవరి 25: రాష్ట్రవ్యాప్తంగా శుక్రవారం 75వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం, ప్రైవేటు సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, విద్యాలయాలు భారీగా ఏర్పాట్లు చేసుకున్నాయి. చెన్నైతోపాటు రాష్ట్రంలో వున్న అన్ని విమానాశ్రయాలకు ఏడంచెల భద్రత ఏర్పాటు చేయగా, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు, రద్దీ అధికంగా వుండే కూడళ్లు, సమస్యాత్మక ప్రాంతాలు, ఆలయాలు, మసీదులు, చర్చిలు, డ్యాంలు, ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాల వద్ద పోలీసు పహారా పెంచారు. సాయుధ బలగాలను రంగంలోకి దించారు. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్లో ప్రయాణీకుల లగేజీని క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

మెరీనాలో 7,000 మంది పోలీసులు:

రాష్ట్రప్రభుత్వం ఆధ్వర్యంలో గణతంత్ర దినోత్సవం జరిగే మెరీనా ప్రాంతంలో 7,000 మంది పోలీసులు నియమితులయ్యారు. మెరీనాబీచ్ రోడ్డులో మెట్రోరైల్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో గాంధీ విగ్రహం వద్ద జరగాల్సిన ఈ వేడుకను శ్రామికుల విగ్రహం వద్ద చేపట్టిన విషయం తెలిసిందే. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం భారీ ఏర్పాట్లు చేపట్టింది. గవర్నర్ పతాకావిష్కరణ కోసం ఇప్పటికే ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసిన రాష్ట్రప్రభుత్వం.. వీఐపీల కోసం ప్రత్యేక కుర్చీలు సిద్ధం చేసింది. అదే విధంగా ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా గవర్నర్ ప్రయాణించే మెరీనాబీచ్ రోడ్డులోని కొన్ని ప్రాంతాల్లో ఇరువైపులా కర్టెన్లు ఏర్పాటు చేసింది. బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్, జాగిలాలు ఈ ప్రాంతంలో అణువణువునూ తనిఖీ చేస్తున్నాయి.

తిరుచ్చిలో కరుణానిధి కాంస్యవిగ్రహం

ఆవిష్కరించిన మంత్రి ఉదయనిధి

పెరంబూర్, జనవరి 25: తిరుచ్చి టీవీఎస్ టోల్‌గేట్‌లో ఏర్పాటుచేసిన దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి కాంస్య విగ్రహాన్ని మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్ పర్యవేక్షణలో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి ఉదయనిధి చెన్నై నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరించారు. ఈ విషయమై మంత్రి ఉదయనిధి తన 'ఎక్స్'లో... కలైంజర్ శతజయంతి వేడుకల సందర్భంగా తిరుచ్చి దక్షిణ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో 100 రోజుల పాటు 100 కార్యక్రమాలు నిర్వమిస్తున్నారని, ఆ క్రమంలో, 75 కార్యక్రమాలు పూర్తికాగా, 76వ కార్యక్రమంగా కలైంజర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం జరిగిందన్నారు. డీఎంకేకు కంచుకోటగా తిరుచ్చి ఉందని, రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో 40కి 40 స్థానాల్లో డీఎంకే కూటమి అభ్యర్థులను విజయం చేకూర్చేలా కార్యకర్తలు సిద్ధపడాలని మంత్రి పిలుపునిచ్చారు.



కరుణానిధి విగ్రహాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆవిష్కరిస్తున్న మంత్రి ఉదయనిధి

ముగ్గురు రైతులకు 'నమ్మాళ్వార్' పురస్కారాలు


సిద్ధర్, పళనిస్వామి, ఎళిలన్

పెరంబూర్, జనవరి 25: రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో 2023-24వ సం వత్సరానికి ఉత్తమ రైతులకు అందజేసే 'నమ్మాళ్వార్' పురస్కారానికి ముగ్గురు రైతులు ఎంపికయ్యారు. తంజావూరు జిల్లా మగర్ నోన్బుచావిడికి చెందిన కె.సిద్ధర్‌కు మొదటి పురస్కారంగా రూ.2.50 లక్షల నగదు, సర్టిఫికేట్, పతకం, తిరుప్పూర్ జిల్లా పొంగలూరుకు చెందిన కేవీ పళనిస్వామికి రెండవ పురస్కారంగా రూ.1.50 లక్షల నగదు, సర్టిఫికేట్, పతకం, కాంచీపురం జిల్లా అచ్చుగాడు గ్రామానికి చెందిన కె.ఎళిలన్‌కు మూడవ పురస్కారంగా రూ.1 లక్ష నగదు, సర్టిఫికేట్, పతకం అందజేయనున్నారు. సేంద్రీయ వ్యవసాయం చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న వారికి ప్రభుత్వం ప్రతి ఏటా గణతంత్ర దినోత్సవం రోజున 'నమ్మాళ్వార్ పురస్కారాలు ప్రదానం చేస్తున్న విషయం తెలిసిందే.

రాష్ట్రంలో 25 ఎంపీ సీట్లు కైవసం

శివరాజ్‌సింగ్ చౌహాన్

పెరంబూర్, జనవరి 25: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో రాష్ట్రంలో 25 స్థానాలతో పాటు దేశవ్యాప్తంగా 400 స్థానాల్లో బీజేపీ విజయం సాధిస్తుందని మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. మదురై జిల్లా బీజేపీ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం తమిళనాడుకు రూ.90 వేల కోట్లు నిధులు అందించగా, ప్రస్తుతం మోదీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం రూ.2.47 లక్షల కోట్లు అందజేసిందని తెలిపారు. రాష్ట్రంలో డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలను ఒకే దూరంలో ఉంచామన్నారు.అవినీతిపార్టీలతో 'ఇండియా' కూటమి ఏర్పాటైందని ఎద్దేవాచేశారు.

31 నుంచి గిండి ఆసుపత్రిలో ఫీజుల వార్డులు

పెరంబూర్, జనవరి 25: స్థానిక గిండిలో ఏర్పాటైన కలైంజర్ సెంటినరీ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని గత జూన్ 15వ తేది ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ప్రారంభించారు. 4.89 ఎకరాల విస్తీర్ణంలో మూడంతస్తులతో ఏర్పాటైన ఈ ఆసుపత్రిలో యూరాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ సహా 20 శాఖలు పనిచేస్తున్నాయి. ఈ విషయమై ఆసుపత్రి డీన్ పార్థసారిధి మాట్లాడుతూ... జ్వరాలు, రోడ్డు ప్రమాదాలు తదితర బాధితులకు సత్వర చికిత్సలు అందిస్తున్నామన్నారు. ఈ ఆసుపత్రిలో ఉచితంగా చికిత్సలందిస్తున్నా, తక్కువ ఫీజుతో ప్రత్యేక గదులు ఏర్పాటుచేయాలని నిర్ణయించామని తెలిపారు. ఈ గదులు ఏసీ, టీవీ, ఆక్సిజన్ తదితర సౌకర్యాలతో పాటు 24 గంటలకు వైద్యులు, పర్యవేక్షణ ఉంటుందన్నారు. రూ.1,000, రూ.2,000, రూ.3,000 అని ఫీజులతో కలిగిన గదులు ఈ నెల 31వ తేది నుంచి అందుబాటులోకి వస్తాయన్నారు. 10 ఆపరేషన్ థియేటర్లు ప్రారంభిస్తున్నట్లు ఆయన తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

వేలూరు, జనవరి 25: జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక టౌన్ హాలు నుంచి గురువారం ఉదయం ర్యాలీని కలెక్టర్ కమరవేల్ పాండ్యన్ జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, ఓటు హక్కు ప్రాధాన్యత తెలియజేసేలా ప్రజలకు కరపత్రాలు అందజేశారు. క్విజ్, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ బహుమతులు అందజేశారు.

చర్చి ప్రాంగణంలోని దేవదూత విగ్రహం నుంచి నీరు

భక్తుల పరవశం


విగ్రహం చేతి నుంచి కారుతున్న నీరు (పక్క చిత్రంలో) గుమిగూడిన భక్తులు

పెరంబూర్, జనవరి 25: తూత్తుకుడి జిల్లా ఒట్టపిడారం పంచాయతి పరిధిలోని దరువకుళం ప్రాంతంలో సెయింట్ మిక్కల్ ఆదిదూత ఆలయం ఉంది.ఆ ఆలయముందు, వెనుక భాగాల్లో దేవదూత విగ్రహాలు ఏర్పాటుచేశారు. ఈనేపథ్యంలో,కుడివైపునున్న దేవదూత విగ్రహం ఎడమ చేతి వేళ్ల నుంచి నీరు రావడాన్ని గమనించిన భక్తులు ఆశ్చర్యానికి గురయ్యారు.ఆవిషయం దావానలంలా వ్యాపించడంతో చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి,ఆ అద్భుత దృశ్యాన్ని వీక్షించి ప్రత్యేక ప్రార్థనలు చేసి వెళుతున్నారు. ప్రస్తుతం దేవదూత విగ్రహంనుంచి నీరు కారే దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

1న లెదర్ ఫ్యాషన్‌షో


ఐఎఫ్‌ఎంఎల్ఈఏ నిర్వాహకులతో లెదర్ బ్యాగులు, పాదరక్షలు ధరించి ప్రదర్శనలో పాల్గొన్న మాడల్స్

చెన్నై,జనవరి25(ఆంధ్రజ్యోతి): భారతీయ తోలువస్తువుల ఉత్పత్తిదారులు, ఎగుమతిదారులసంఘం(ఐఎఫ్ఎంఎల్ఈఏ)ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1వ తేదీన గిండి ఐటీసీగ్రాండ్ చోళాలో లెదర్ ఫ్యాషన్ షో నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు కేఆర్ విజయన్ తెలిపారు.నగరంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పూర్తయిన తోలు వస్తువుల వాణిజ్యానికి సంబంధించిన సమస్యలపై తగు మార్గదర్శకత్వం అందించడానికి వీలుగా ఈ ప్రదర్శనను భారీ ఎత్తున నిర్వహిస్తున్నామని చెప్పారు. 10 ప్రముఖ కంపెనీలకు చెందిన తోలువస్తువులను ప్రదర్శించనున్నామని, ఫ్యాషన్ షోలో ప్రముఖ మాడల్ శ్వేతా జయశంకరన్ సహా 60మందికి పైగా మాడల్స్ పాల్గొంటారని తెలిపారు. సమావేశంలో సంఘం గౌరవకార్యదర్శి మహమ్మద్ జహాన్, సభా గ్రూపు చైర్మన్ ఎస్కే సభాపతి, ప్రోగ్రామ్ మేనేజర్ సురిల్ పన్నీర్‌సెల్వం పాల్గొన్నారు. సమావేశంలో పర్యావరణానికి హానికలిగించని లెదర్ బ్యాగులు, దుస్తులను ప్రముఖ మాడల్స్ ప్రదర్శించారు.

గూండా చట్టం కింద 26 మంది అరెస్ట్

పెరంబూర్, జనవరి 25: నగరంలో నేరాలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడిన కేసుల్లో వారం రోజుల్లో ఒక మహిళ సహా 26 మంది గూండా చట్టం కింద అరెస్ట్ చేశారు. ఈ మేరకు నగర పోలీసు శాఖ విడుదల చేసిన ప్రకటనలో... నగర పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్ ఉత్తర్వులతో ఈ నెల 18 నుంచి 24వ తేది నిర్వహించిన తనిఖీల్లో పలు చోరీలతో సంబంధాలున్న 26 మందిని గూండా చట్టం కింద అరెస్ట్ చేశామన్నారు. ఈనెల 1 నుంచి 24వ తేది వరకు హత్య, హత్యాయత్నం కేసుల్లో 31 మంది. ప్రజలకు ఇబ్బంది కలిగించేలా వ్యవహరించిన 14 మంది, నేరాలు, గంజాయి విక్రయాలకు సంబంధించి 13 మంది, మీన ఛీటింగ్ కేసులో ఇద్దరు అని మొత్తం 60 మందిని గూండాచట్టం కింద అరెస్ట్ చేసినట్లు నగర పోలీసు శాఖ తెలిపింది.

కళాశాలల్లో ప్రకటన బోర్డులు ఏర్పాటు చేయాలి

ఐసిఎఫ్, జనవరి 25: మహిళలపై జరిగే లైంగిక వేధింపులకు సంబంధించి చేపట్టే చర్యలను ప్రకటన బోర్డులుగా ఏర్పాటుచేయాలని కళాశాలలకు యూజీసీ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు యూజీసీ పంపిన సర్క్యులర్‌లో... కోర్టు ఉత్తర్వుల ప్రకారం లైంగిక వేధింపులపై చేపట్టనున్న చట్టపరమైన చర్యలు, శిక్షలు వివరాలతో కూడిన బోర్డులను ఏర్పాటుచేయాలని, అందులో తప్పనిసరిగా మహిళల హెల్ప్ లైన్ నెంబర్లు పేర్కొనాలని సూచించింది.

తైపూస ఉత్సవంలో కూలిన రథం



పెరంబూర్, జనవరి 25: ఈరోడ్ జిల్లాలో తైపూస ఉత్సవాల్లో నిర్వహించిన రథోత్సవంలో అపశృతి చోటుచేసుకుంది. రథం హఠాత్తుగా కూలడంతో అదృష్టవశాత్తు భక్తులకు ఎలాంటి ప్రమాదం జరుగలేదు. సత్యమంగళం సమీపం కొండయంపాళయం సమీపంలో ప్రసిద్ధిచెందిన పొన్‌మలై ఆండవర్ ఆలయం ఉంది. ఈ ఆలయంలో తైపూస ఉత్సవాలు ప్రతి ఏడాది కోలాహలంగా నిర్వహిస్తుంటారు. గురువారం ఉదయం స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అలంకరణ, పూజలు నిర్వహించి, రథోత్సవం చేపట్టారు. ఈ వేడుకల్లో వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రథం ఓ వీధి మలుపు తిరుగుతున్న సమయంలో అక్కడ ఉన్న గుంతలో రథం చక్రం చిక్కుకొని పక్కకు ఒరిగిపోయింది. ఊహించని ఘటనకు భక్తులు భయంతో పరుగులు తీశారు. అనంతరం ప్రొక్లయిన్ యంత్రం ద్వారా రథం నిలబెట్టే పనులు చేపట్టారు.

వడలూరులో జ్యోతి దర్శనం


వడలూరు జ్ఞానసభలో తైపూస జ్యోతి దర్శనం

ప్యారీస్, జనవరి 25: జీవకారుణ్య మూర్తి, ఆధ్యాత్మిక గురువు రామలింగ అడిగళార్ ముక్తి పొందిన వడలూరు క్షేత్రంలో తైపూసం సందర్భంగా గురువారం జ్యోతి దర్శన వేడుకలు వైభవంగా నిర్వహించారు. కడలూరు జిల్లా వడలూరు సత్య జ్ఞానసభలో సన్మార్గ సంఘం నిర్వాహకులు ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు ఏడు తెరలను వరుసగా తొలగించి పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులకు జ్యోతి దర్శనం కల్పించారు. జ్యోతిని దర్శించిన భక్తులు 'తనిపెరుం కరుణై' నినాదాలతో వేదిక ప్రాంగణం మార్మోగింది. ఈ ఏడాది 153వ తైపూస జ్యోతి దర్శన ఉత్సవాల్లో మంత్రులు ఎమ్మార్కే పన్నీర్‌సెల్వం, గణేశన్, కలెక్టర్ అరుణ్ తంబురాజ్, హిందూ దేవాదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు. విల్లుపురం రామలింగ అడిగళార్ ఆలయంలో తైపూస వేడుకల సందర్భంగా 1,000కుటుంబాలకు 5 కిలోల బియ్యాన్ని జయ అన్నామలై, శివకుమార్, దినేస్, జనగరాజ్ తదితర నిర్వాహకులు పంపిణీ చేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సహపంక్తి భోజన కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

డీఎంకే పాలనలో అభివృద్ధి శూన్యం

బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

ప్యారీస్, జనవరి 25: డీఎంకే అధికారంలోకి వచ్చి సుమారు 30 నెలలు గడిచినా రాష్ట్రంలో అభివృద్ధి అంతంత మాత్రమేనని బీజేపీ ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ వ్యాఖ్యానించారు. కోయంబత్తూర్‌లో గురువారం తైపూసం సందర్భంగా సుబ్రమణ్యస్వామి భక్తులు చేపట్టిన పాదయాత్రను ఆమె ప్రారంభించి మీడియాతో మాట్లాడారు. ద్రావిడ మోడల్ ప్రభుత్వ పాలకులు ఆలయాల ఆస్తులను, ఆదాయాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, పూజల్లో భక్తులు పాల్గొనేందుకు ఆంక్షలు విధించడంతోపాటు బీజేపీ కార్యకర్తలపై తప్పుడు కేసులు నమోదుచేస్తున్నారని ఆరోపించారు.

ప్రొఫెసర్ అమర్ అగర్వాల్‌కు 'నార్మన్ గాల్లోవే' అవార్డు



చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రుల గ్రూపు అధ్యక్షుడు ప్రొఫెసర్ అమర్ అగర్వాల్‌కు నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో నార్మన్ గాల్లోవే అవార్డును ప్రదానం చేశారు. ఇటీవల జరిగిన సదస్సులో అమర్ అగర్వాల్ నేత్రవైద్య రంగంలో అంతర్జాతీయపరంగా చోటుచేసుకున్న విప్లవాత్మకమైన మార్పులు గురించి ప్రసంగించారు. అమర్ అగర్వాల్ నేత్రవైద్యరంగంలో అందించిన విశిష్టమైన సేవలకుగాను నాటింగ్‌హామ్ విశ్వవిద్యాలయం ఆప్తమాలజీ విభాగం ప్రొఫెసర్ హర్మిందర్‌సింగ్ దువా ఈ అవార్డును ప్రదానం చేసి సత్కరించారు.

'రాజస్థాన్ శ్రీ అవార్డు'ల పంపిణీ


అవార్డుల ప్రదానోత్సవంలో ప్రముఖులు

అడయార్, జనవరి 25: సమాజసేవ, సాహిత్యం, వ్యాపార రంగాల్లో విశేష సేవలు అందించిన వారిని గుర్తించి వారికి 'రాజస్థాన్ శ్రీ అవార్డు' లనన రాజస్థానీ అసోసియేషన్ తమిళనాడు విభాగం ప్రత్యేకంగా సన్మానించింది. స్థానిక రాయపేటలోని మ్యూజిక్ అకాడెమీలో జరిగిన ఈ ప్రదానోత్సవ కార్యక్రమంలో బల్దోత గ్రూపు కంపెనీ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నరేంద్ర కుమార్ ఏ.బల్దోట, ఇంటెలెక్ట్ డిజైన్ అరీనా లిమిటెడ్ ఛైర్మన్, సీఈవో, అరుణ్ జైన్‌లు ముఖ్య అతిథులుగా పాల్గొని అవార్డులు పంపిణీ చేశారు. ఈ అవార్డులు అందుకున్న గౌరి శంకర్ (సమాజ సేవ), మంగల్ చంద్ తాతెర్ (సమాజ సేవ), ఎం.రుఖుమ్‌చంద్ బోహ్రా (సోషల్ సర్వీస్), డాక్టర్ దిలీప్ ధింగ్ (సాహిత్యం)లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో అవార్డుల కమిటీ ఛైర్మన్ కె.సుభాష్‌చంద్ రంకా, కో-ఆర్డినేటర్ చంద్ర ప్రకాష్ మల్పాణి పాల్గొన్నారు.

కోవైలో 'ఆటోలో గ్రంథాలయం'

పెరంబూర్, జనవరి 25: ప్రజలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచేలా 'ఆటోలో గ్రంథాలయం' అనే ప్రక్రియను ఇదివరకే కోయంబత్తూర్ నగర పోలీసులు పనిచేశారు. కలైంజర్ కరుణానిధి సాంకేతిక విద్య కళాశాల సహకారంతో ఈ పథకం అమలులో ఉంది. అందులో భాగంగా మరో 500 ఆటోల్లో ఈ గ్రంథాలయాలు ఏర్పాటుచేసేయాలని నిర్ణయించిన నగర పోలీసు శాఖ, బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆటో డ్రైవర్లకు పోలీస్ కమిషనర్ బాలకృష్ణన్ పుస్తకాలు అందజేశారు.

బాణాసంచా కర్మాగారంలో పేలుడు

ఒకరి మృతి

పెరంబూర్, జనవరి 25: విరుదునగర్ జిల్లాలోని బాణాసంచా కేంద్రంలో అగ్నిప్రమాదం సంభవించి ఒకరు మృతిచెందాడు. సాత్తూర్-కోవిల్‌పట్టి జాతీయ రహదారి సమీపంలోని అడవి ప్రాంతం లో ఓ వ్యవసాయ పంప్ సెట్ షెడ్ ఉంది. ఈ షెడ్‌లో మీనంపట్టికి చెందిన అజిత్ (23) చట్టవిరుద్ధంగా టపాసులు తయారుచేస్తున్నట్లు సమాచారం. గురువారం ఉదయం బాణాసంచా తయారీకి రసాయన మిశ్రమాలు కలుపుతున్న సమయంలో హఠాత్తుగా పెద్దశబ్దంతో టపాసులు పేలి, షెడ్ కూలిపడింది. ఈ ఘటనలో అజిత్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, సాత్తూర్ తాలూకా పోలీసులు ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మూడుకు పెరిగిన మృతుల సంఖ్య...

విరుదునగర్ జిల్లా పచ్చకారపట్టిలోని బాణాసంచా తయారీ కేంద్రంలో బుధవారం అగ్నిప్రమాదం సంభవించి ఇద్దరు మృతిచెందిన విషయం తెలిసిందే.ఈఘటనలో 90శాతం గాయాలలో మదురై రాజాజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శరవణకుమార్(24) గురువారం ఉదయం మృతిచెందడంతో, మృతుల సంఖ్య మూడుకు పెరిగింది.

కోవై కారు సిలిండర్ పేలుడు కేసు

మరో ఇద్దరిపై చార్జీషీటు దాఖలు

పెరంబూర్, జనవరి 25: కోయంబత్తూర్‌లోని ఉక్కడం ఈశ్వరన్ ఆలయ సమీపంలో గత 2022 అక్టోబరు నెలలో కారులో సిలిండర్ పేలిన ఘటనలో జమేషా ముబీన్ (28) మృతిచెందాడు. ఈ కేసును జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) విచారిస్తోంది. ఈ కేసులో పలు కోణాల విచారణ అనంతరం, మృతుడితో పాటు 15 మందిపై కేసు నమోదుచేసి, వారిలో 14 మందిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో అరెస్టయిన ఒక్కొక్కరిని ఎన్ఐఏ అధికారులు వేర్వేరుగా విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో, ఈ కేసులో ఇటీవల అరెస్టచేసిన మహమ్మద్ అజారుద్దీన్, మహమ్మద్ ఇంతియాజ్ తదితరులపై ఎన్ఐఏ అధికారులు స్థానిక పూందమల్లిలోని ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఇళవళగన్ ముందు బుధవారం చార్జీషీటు దాఖలుచేశారు.


చెన్నై అమింజికరై సెయింట్‌జార్జి పాఠశాల మైదానంలో గురువారం సాయంత్రం జరిగిన భాషోద్యమకారుల సంస్మరణ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్


చెన్నై టి.నగర్ టీటీడీ ఆలయంలో శ్రీరామజన్మభూమి క్షేత్ర ప్రాణ ప్రతిష్ట వేడుకల్లో గురువారం సాయంత్రం గాత్రకచేరీ చేసిన నాగతిస్య, డా. శాస్త్రిని సత్కరిస్తున్న స్థానిక సలహామండలి అధ్యక్షుడు ఏజే శేఖర్, ఉపాధ్యక్షుడు ఆనంద్‌కుమార్‌రెడ్డి, కృష్ణారావు, మోహన్‌రావు, రాధాకృష్ణ ఊరా లక్ష్మీనారాయణ, తదితరులు


చెన్నై గిండి గాంధీమండప ప్రాంతంలో భాషోద్యమంలో ప్రాణాలర్పించిన త్యాగుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న మంత్రులు ఎం.సుబ్రమణ్యం, సామినాథన్, పీకే శేఖర్‌బాబు తదితరులు

కోయంబత్తూరులో డీఎంకే ప్రముఖుడి ఆత్మహత్య

సీఎం స్టాలిన్ సంతాపం


పయ్యాగౌండర్ అలియాస్ కృష్ణన్ (ఫైల్‌ఫోటో)

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో డీఎంకే నాయకుడు ఆత్మహత్య చేసుకున్నారు. కోయంబత్తూరు కానపట్టి పిళ్ళయార్ వీధిలో నివసిస్తున్న పయ్యా గౌండర్ అలియాస్ కృష్ణన్ (65) డీఎంకే సీనియర్ నాయకుడిగా ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. ఆయనకు కానాపట్టికి కాసింత దూరంలో ఫామ్ హౌస్ కూడా ఉంది. ఆ ఫామ్‌హౌస్‌లో కార్మికులు పనిచేస్తుంటారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం కార్మికులు ఆ ఫామ్‌హౌస్‌లో పనిచేయడానికి వెళ్ళినప్పుడు అ చోట ఉన్న చెట్టుకు ఉరివేసుకుని కృష్ణన్ వేలాడుతుండటం చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. వెంటనే కుటుంబీకులకు ఆ సమాచారం అందించారు. వారు హుటాహుటిన చేరుకుని కృష్ణన్‌ను కిందకు దింపి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. కోవిల్‌పాళయం పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరిపారు. ఆ విచారణలో కృష్ణన్ కొంతకాలంగా కుటుంబ కలతల కారణంగా జీవితంపై విరక్తి చెందాడని తెలిసింది. 2006లో కృష్ణన్ కానపట్టి నగరపంచాయతీ అధ్యక్ష పదవికి ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలిచారు. ఆ తర్వాత డీఎంకేలో చేరి రెండుసార్లు గౌండంపాళయం శాసనసభ నియోజకవర్గంలో ఆ పార్టీ తరపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. ఇదిలా ఉండగా పయ్యాగౌండర్ అలియాస్ కృష్ణన్ ఆత్మహత్య చేసుకోవడం పట్ల ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ తీవ్ర సంతాపం ప్రకటించారు.

విద్యుదాఘాతంతో ఆరేళ్ల చిన్నారి మృతి


సుభిక్ష

పెరంబూర్, జనవరి 25: కరూర్ జిల్లా కుళితలై సమీపం శివాయం దక్షిణం ప్రాంతానికి చెందిన రంగస్వామి-పార్వతి దంపతులకు తరుణ్ (12), నితీష్ (8) అనే కుమారులు సుభిక్ష (6) అనే కుమార్తె ఉంది. 2వ తరగతి చదువుతున్న సుభిక్ష గురువారం ఉదయం ఇంటి మరుగు దొడ్డిలో బక్కెట్లో నుంచి వాటర్ హీటర్‌ను చేతితో తీయడంతో, వెంటనే షాక్‌కు గురై సంఘటనా స్థలంలోనే మృతిచెందింది. ఈ ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరు రౌడీల అరెస్ట్

ప్యారీస్, జనవరి 25: ఎన్‌కౌంటర్ భయంతో అజ్ఞాతంలో ఉన్న ఇద్దరు రౌడీలను కాంచీపురం జిల్లా పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు తరలించారు. కాంచీపురం జిల్లా శ్రీ పెరుంబుదూర్ సమీపంలోని కిడాయి ప్రాంతానికి చెందిన చంద్రు (24), బాలచందర్ (22) అనే సోదరులపై హత్య, హత్యాయత్నం, కిడ్నాప్, దౌర్జన్యం కేసులు జిల్లాలోని పలు పోలీస్‌స్టేషన్‌లలో పెండింగ్‌లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో, డీఎంకే ప్రముఖుడు రమేష్‌ను హతమార్చిన కేసులో కీలకపాత్ర పోషించిన చంద్రు సోదరులు పోలీసుల ఎన్‌కౌంటర్‌కు భయపడి అజ్ఞాతంలోకి జారుకున్నారు. వీరి కోసం తీవ్రంగా గాలింపు చర్యలు చేపట్టిన పోలీసులు ఎట్టకేలకు అరక్కోణం సమీపంలోని ఓ ఇంట్లో తలదాచుకున్నట్లు అందిన సమాచారంతో బుధవారం అక్కడకు చేరుకొని వారిద్దర్నీ అరెస్ట్ చేశారు. కాగా, బాధిత బాలికకు గురువారం రాయపేట ప్రభుత్వాసుపత్రిలో సుమారు 4గంటలు వైద్యపరీక్షలు నిర్వహించారు.

అగ్నిప్రమాదంలో మాజీ మంత్రి కోడలు మృతి


పూర్ణిమ (ఫైల్‌ఫొటో)

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి జిల్లా కారిమంగలం ప్రాంతంలో అన్నాడీఎంకే మాజీ మంత్రి కేపీ అన్బళగన్ కోడలు పూర్ణిమ (30) అగ్ని ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతి చెందింది. పోలీసుల సమాచారం మేరకు గత వారం పూజ గదిలో పూజ చేస్తుండగా పూర్ణిమ ఉన్నట్టుండి మూర్ఛిల్లి నేలపై పడింది. ఆమె చీర కొంగు దీపంపై పడటంతో నిప్పంటుకుంది. ఆ దృశ్యాన్ని చూసిన కుటుంబీకులు వెంటనే ఆమెను ధర్మపురి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ తర్వాత మెరుగైన చికిత్స కోసం వేలూరులోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం ఆసుపత్రిలో చికిత్స ఫలించక పూర్ణిమ మృతి చెందింది.

హెవీ డ్యూటీ ట్రక్కుల కోసం ఐషర్ నాన్ స్టాప్ సిరీస్

అడయార్, జనవరి 25: వీఈ కమర్షియల్ వెహికల్స్ లిమిటెడ్ వ్యాపార అనుబంధ విభాగమైన ఐషర్ కంపెనీ కొత్త శ్రేణి వాహనాల్లో భాగంగా ఐషర్ నాన్ స్టాప్ సిరీస్‌ను హెవీ డ్యూటీ ట్రక్కులను అందు బాటులోకి తెచ్చింది. మొత్తం నాలుగు కొత్త హెవీ డ్యూటీ ట్రక్కులు కొత్తగా లాంచ్ చేసిన వాటిలో ఉన్నాయి. ఈ కొత్తగా ప్రవేశపెట్టిన వాహనాల్లో ఐషర్ ప్రో 6019ఎక్స్‌పీటీ, ఐషర్ ప్రో 6048 ఎక్స్‌పీ, ఐషర్ ప్రో 6055 ఎక్స్‌పీ, ఐషర్ ప్రో 6055 ఎక్స్‌పీలు ఉన్నాయి. వీఈసీవీ మేనేజింగ్ డైరెక్టర్ వినోద్ అగర్వాల్ మాట్లాడుతూ, ఈ కొత్త ట్రక్కులు ఉన్నత స్థాయి ప్రమాణాలకు దీటుగా, లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని, వ్యయాన్ని మెరుగుపరచడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు.

న్యూ ట్రామా కేర్ యూనిట్ ప్రారంభం

అడయార్, జనవరి 25: నైవేలీ లిగ్నైట్ కార్పొరేషన్ (ఎన్ఎల్‌సీ) లిమిటెడ్... కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద కురింజిపాడి జనరల్ హాస్పిటల్‌లో న్యూ ట్రామా కేర్ యూనిట్ కొత్తగా నిర్మించారు. ఈ యూనిట్‌ను గురువారం ప్రారంభించారు. ఎన్ఎల్‌సీ లిమిటెడ్ సీఎండీ ప్రసన్నకుమార్ మోతుపల్లి, రాష్ట్ర మంత్రి ఎంఆర్‌కే పన్నీర్‌సెల్వం, కడలూరు కలెక్టర్ డాక్టర్ ఏ.అరుణ్ తంబురాజ్ తదితరులు పాల్గొన్నారు.

త్రిపుర సంహారక క్షేత్రం తిరువడిగై

రాజరాజచోళుడు మెచ్చిన వీరాటేశ్వరాలయం

ఆంధ్రజ్యోతి, చెన్నై


ఆలయ అంతర ప్రాకారం

కడలూరు జిల్లా పన్రుట్టి నగరానికి రెండు కిలోమీటర్ల దూరంలో తిరువడిగై గ్రామంలో తిరువడిగై వీరాటేశ్వర ఆలయం. ఈ ఆలయాన్ని వీరాటణ్యేశ్వరస్వామి ఆలయం అని కూడా పిలుస్తున్నారు. త్రిపురాంతక సంహార క్షేత్రంగా భాసిల్లుతోంది. ఈ ఆలయం రెండువేల సంవత్సరాలకు మునుపు నిర్మించిన అత్యంత ప్రాచీన ఆలయమని చరిత్రకారులు చెబుతున్నారు. ఈ క్షేత్రాన్ని తిరునావుక్కరసర్, తిరుజ్ఞానసంబంధర్, సుందరర్, మాణిక్యవాచగర్ వంటి మేటి శైవభక్తశిఖామణులు సందర్శించి స్వామివారి విభవాలను కీర్తించి తరించారు. ఈ క్షేత్రానికి దేవేంద్రుడు, బ్రహ్మదేవుడు, పెరుమాళ్, పాండవులు, సప్తరుషులు, వాయుభగవానుడు, వరుణభగవానుడు, యమధర్మరాజు విచ్చేసి స్వామివారి అనుగ్రహం పొందారని పౌరాణిక గాథలు చెబుతున్నాయి. అసురులను సంహరించడానికి పరమేశ్వరుడు రథంలో వేంచేయడం వల్ల ఈ ఆలయ గర్భాలయం రథం ఆకారంలో నిర్మితమై ఉంది.. ఈ ఆలయ గర్భగృహ విమానాన్ని చూసే రాజరాజచోళుడు తంజావూరులో బృహదీశ్వరాలయాన్ని నిర్మించారని చరిత్రకారులు పేర్కొంటున్నారు. తిరువడిగై ఆలయ గోపురం నీడ నేలపై పడని రీతిలో గణితశాస్త్ర పద్ధతిలో నిర్మించారు. ఇదే రీతిలోనే బృహదీశ్వరాలయ గోపురం నీడ కూడా నేలపై పడని రీతిలోనే రాజరాజచోళుడు నిర్మించాడు. ఎలాంటి ఆయుధాలు ధరించకనే ఓ అందమైన చిరునవ్వుతో పరమేశ్వరుడు త్రిపుర సంహారం చేసిన దివ్యక్షేత్రమిదే. దేవారం తొలిసారిగా కీర్తించబడిన క్షేత్రంగాను పేరుగడించింది. తొట్టతొలుత రథ నిర్మాణం జరిగిన క్షేత్రం కూడా ఇదే. ప్రస్తుతం ఆలయాలలో రథాలు ఉండాలనే ఐతిహ్యం తొలుత రూపొందింది కూడా ఇక్కడే.


రథం ఆకారంలో నిర్మితమైన గర్భాలయం


నంది మంటపం


రథం, రాజగోపురం


ఆలయ అంతర ప్రాకారంలో ప్రత్యేక సన్నిధిలో బుద్ధుడి విగ్రహం

తిరునావుక్కరసర్‌కు ముక్తి...

తిరువడిగై నగరానికి పడమర సుమారు ఎనిమిది కిలోమీటర్ల దూరంలో తిరువామూరు అనే ఊరిలో జన్మించిన తిరునావుక్కరసర్ జైనమతంలో ఉండేవారు. ఆయన సోదరి తిలకవతి శైవమతంలో ఉండేవారు. ఆమె వీరాటణ్యేశ్వరస్వామివారికి సేవలందించేవారు. ఓ సమయం తిరునావుక్కరసర్‌కు శూల వ్యాధి (ఉదరకోశ వ్యాధి) రావటంతో తీవ్రంగా బాధపడ్డారు. జైన మతగురువులు తిరునావుక్కరసర్ వ్యాధిని నయం చేసేందుకు ఎంతగా ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. అంతే కాకుండా వ్యాధి తీవ్రమైంది. నొప్పిని భరించలేక తిరునావుక్కరసర్ తన వ్యాధిని నయం చేసే మార్గం తెలుపమంటూ సోదరిని అడిగాడు. ఆమె తన తమ్ముడిని వీరాటేశ్వర స్వామివారి ఆలయానికి తీసుకెళ్ళి అక్కడి తీర్థపుబావి నుండి తీర్థాన్ని తీసి తాపించింది. పంచాక్షరి మంత్రాన్ని ఉపదేశించి విభూతిని అతడి నుదుట దిద్ది, చిటికెడు విభూతిని అతడి నోటిలో వేసింది. దీనితో క్షణాలలో తిరునావుక్కరసర్ ఉదరకోశ వ్యాధి నుండి బయటపడ్డారు. అప్పటి నుండి తిరునావుక్కరసర్ శైవమతంలోకి మారి పరమేశ్వరుడిని కీర్తించసాగారు. ఈ క్షేత్రపు స్వామివారిని దర్శిస్తే గర్వం తొలగి ప్రశాంత చిత్తులుగా మారుతారని, దీర్ఘకాలంగా దురకోశవ్యాధితో బాధపడుతున్నవారు త్వరగా కోలుకుంటారని, శత్రుభయం తొలగతుందని,వివాహయోగం,సంతానభాగ్యం కలుగుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసంగా ఉంటోంది. తిరువడిగై వీరాటణ్యేశ్వరస్వామిని దర్శనం చేసుకుంటే కైలాస ప్రాప్తి లభిస్తుందని శైవాగమపండితులు చెబుతారు. ఈ ఆలయంలో కొలువైన సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారిని కీర్తిస్తూ అరుణగిరినాథర్ గానం చేసి తరించారు.


తిరునావుక్కరసర్‌కు ఉపశమనం కలిగించిన శూలతీర్థం (బావి)


ఆలయ గోపురంపై పరమేశ్వరుడి శిల్పం

స్థల పురాణం...

దారుకాక్షుడు, కమలాక్షుడు, విద్యున్మాలి అనే ముగ్గురు రాక్షసులు బ్రహ్మదేవుడి అనుగ్రహం కోసం ఘోరతపమాచరించారు. ఆ మువ్వురి తపస్సును మెచ్చి బ్రహ్మదేవుడు వారి ఎదుట ప్రత్యక్షమయ్యాడు. బ్రహ్మదేవుడి ద్వారా తామెవరి వల్లా సంహరించ కుండా ఉండేలా వరం పొంది విర్రవీగి దేవతలను, మునులను, సాధువులను చిత్రహింసలు చేయసాగారు. దేవతలంతా ఆ రాక్షసులను సంహరించి రక్షించమంటూ పరమేశ్వరుడిని కోరారు. ఆ ప్రకారమే భూమిని రథంగా, సూర్యచంద్రులను రథచక్రాలుగా, చతుర్వేదాలను అశ్వాలుగా, బ్రహ్మదేవుడిని రథసారథిగా చేసుకుని స్వామివారు మేరు పర్వతాన్ని వింటిగా, వాసుకి అనే సర్పాన్ని బాణంగా, ఆ బాణం చివర అగ్నిదేవుడి ద్వారా మంటలను పుట్టించి పరమేశ్వరుడు ఆ అసురులను సంహరించేందుకు బయలుదేరారు. మార్గమధ్యంలోనే రథం ఇరుసు విరిగింది. తన పెద తనయుడైన విఘ్నేశ్వరుడిని మొక్కకపోవడంలో వల్లే ఆ ఆటంకం కలిగిందని పరమేశ్వరుడు గ్రహించారు. వినాయకుడిని మొక్కి మళ్ళీ అసుర సంహారానికి వెళ్ళారు. ఆ రథంతోపాటు వెళ్ళిన దేవతలంతా గుంపుగా వెళుతున్న తమను చూసి ఆ రక్కసులు ప్రాణాలు కోల్పోవటం ఖాయమని గర్వపడసాగారు. అదే సమయంలో పరమేశ్వరుడు తాను ధరించిన ఆయుధాలన్నింటిని విసర్జించి, తనతో పోరుసాగేందుకు వస్తున్న ఆ రక్కసులవైపు చూసి పరమేశ్వరుడు కాస్త చిరునవ్వు నవ్వారు. అంతే! సమస్త లోకాలు భూకంపం వచ్చినట్లు వణికాయి. పరమేశ్వరుడి నోటి నుండి అగ్నిజ్వాలలు వెలువడి ఆ రక్కసులను దహించి వేశాయి. ఈ సంఘటనతో ఇటు దేవతల గర్వం, అటు రాక్షసుల మదం అణగిపోయాయి. ఇలా ముప్పురు రాక్షసులను సంహరించిన క్షేత్రం కనుక ఈ క్షేత్రం త్రిపురసంహారక క్షేత్రంగా కీర్తిగడించింది.

స్వామివారి నామధేయం : వీరాటణ్యేశ్వరర్
అమ్మవారి నామధేయం : పెరియనాయగి, త్రిపుర సుందరి
పౌరాణిక నామధేయం : అధికారపురి
తీర్థం : శూల తీర్థం


ఆలయ ధ్వజస్తంభం

ఆధ్యాత్మికం

ఆలయ ఉత్సవాలు

ప్రతియేటా పంగుణి, చిత్తిరై మాసాల్లో పదిరోజులపాటు బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారు. అప్పర్ మోక్షం ఉత్సవాలు, వైయ్యాసి బ్రహ్మోత్సవం, మార్గశిర మాసంలో తిరువడిగై నటరాజస్వామివారికి తీర్థవారి వేడుకలు, ఆరుద్రదర్శన ఉత్సవాలు జరుగుతాయి. మహాశివరాత్రి వేడుకలు కూడా వైభవంగా నిర్వహిస్తారు.

ఆలయ విశేషాలు

కడలూరు జిల్లా పన్రుట్టి నగరానికి రెండు కిలోమీటర్ల దూరంలో తిరువడిగై అనే గ్రామంలో ఉంది ఈ ఆలయం. రాష్ట్రంలోని పలు నగరాల నుండి పన్రుట్టికి రవాణా సంస్థ బస్సులు నడుపుతున్నారు. పన్రుట్టి బస్టాండులో దిగి ఆటోలు, టాక్సీలలో రెండు కిలోమీటర్ల దూరంలో తిరువడిగైలో ఉన్న ఈ ఆలయాన్ని చేరుకోవచ్చు. ప్రతి రోజూ ఉదయం 6 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు మళ్ళీ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు భక్తులను దర్శనానికి అనుమతిస్తారు.

ఆలయ వైభవం...

ఈ ఆలయనిర్మాణాన్ని ప్రత్యేకించి గర్భాలయం రథం ఆకారంలో నిర్మితమై ఉండటాన్ని చూసి రాజరాజచోళ చక్రవర్తి విస్తుపోయారు. ఆ తర్వాత తంజావూరులో బృహదీశ్వరాలయాన్ని ఇక్కడి గర్భాలయం రూపంలో ఎత్తుగా నిర్మించారని చరిత్రకారులు చెబుతున్నారు. ఆలయ రాజగోపురం తూర్పుదిశగా ఏడు అంతస్థులతో నిర్మితమై ఉంది.ఆలయం ఎదుట 16 కాళ్ళ మండపం కూడా ఉంది. ఈ మండప స్తంభాలపై వృషభరూఢులు, అప్పర్. మయిల్‌వాహనన్ తదితరుల శిల్పాలు ఉన్నాయి. ఈ ఆలయంలోని స్వామివారి స్వయంభు మూర్తిగా అనుగ్రహిస్తున్నారు. నుదుట 16 రేఖలు కలిగిన మహాలింగమిది. పరమేశ్వరుడి దేవారకీర్తనలను ఆలాపించిన 274 శైవక్షేత్రాలలో ఇది 218వ దేవార క్షేత్రంగా కీర్తింపబడుతోంది. ప్రవేశ ద్వారంలో అడుగుపెడితే ఇరువైపులా నృత్యకళను చాటిచెప్పే 108 నృత్య శిల్పాలు కూడా దర్శనమిస్తాయి. అంతరప్రాకార దక్షిణదిశగా శంకరతీర్థం, ఉత్తర దిశగా ఐదడుగుల ఎత్తుకలిగి పద్మాసన భంగిమలో బుద్ధుడి విగ్రహం దర్శనమిస్తాయి. రెండో గోపురం ప్రవేశద్వారంలోకి అడుగుపెడితే వినాయకుడు, ధ్వజస్తంభం, బలిపీఠం, ఐదు అంతస్థులు కలిగిన ఈ గోపురాన్ని దాటుకుని వెళితే పెద్ద నంది విగ్రహం దర్శనమిస్తుంది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, గణపతి విగ్రహాలు కూడా ఉన్నాయి. భైరవుడు, శనీశ్వరుడు, దుర్గాదేవి, గరుడాళ్వార్, తిరుమాళ్, పంచపాండవుల విగ్రహాలు దర్శనమిస్తాయి. పల్లవుల కాలంనాటి సంచముఖ లింగం కూడా ఆలయ అంతర ప్రాకారంలో అందంగా దర్శనమిస్తోంది. ఆలయ ప్రవేశద్వార రాజగోపురం ముందే విభూతి మండపం ఉంది. ఈ ఆలయ జీర్ణోద్ధరణ పనులు చేపట్టినప్పుడు భూమిలో నుండి బయల్పడిన వరాహి అమ్మవారి విగ్రహాన్ని కూడా ఈ ప్రాంతంలోనే ప్రతిష్ఠించారు. గర్భాలయానికి వెనుకవైపు కుడ్యంపై స్వామి, అమ్మవార్ల తిరుకళ్యాణోత్సవ దృశ్యం అందంగా చెక్కబడి ఉంది. తిరునావుక్కరసర్‌కు ఇరువురూ వధూవరులుగా దర్శనమివ్వడాన్ని ఈ శిల్పాలు చాటిచెబుతున్నాయి. గర్భాలయ విమానం, గర్భాలయం రథం ఆకారంలో ఉండటం విశేషం అమ్మవారి సన్నిధి స్వామివారికి కుడివైపు ఉంది. వివాహభాగ్యం నోచుకోనివారంతా ఈ అమ్మవారిని దర్శిస్తే వివాహయోగం లభిస్తుంది. గర్భాలయం వద్ద స్వామి, అమ్మవారిని దర్శించే భక్తులంతా ఆలయ అర్చకులు ఇచ్చే విభూతిని శిరస్సు వంచి నుదుట పెట్టుకోవాలని చెబుతారు.

మిస్టరీ హర్రర్ థ్రిల్లర్‌గా నరేన్ 'ఆత్మ'

నరేన్ హీరోగా భయపెట్టే 'ఆత్మ' పేరుతో ఒక చిత్రం తెరకెక్కింది. కద్రీస్ ఎంటర్‌టైన్మెంట్ యూఏఈ బ్యానరుపై అతిభయంకరమైన మిస్టరీ హర్రర్ థ్రిల్లర్ మూవీగా రూపొందింది. రాకేష్ శంకర్ స్క్రీన్ ప్లే అందించగా, సుఖీత్ దర్శకత్వం వహించారు. కె.చంద్రూ మాటలు సమకూర్చారు. ప్రశ్నలకు జవాబులను శోధించే కథానాయకుడిగా నటించారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను ఇప్పటికే విడుదల చేయగా, ఇటు అభిమానుల నుంచి అటు సినీ ప్రముఖుల నుంచి మంచి స్పందన వచ్చింది. 'ఖైదీ', 'విక్రమ్' చిత్రాల్లో అద్భుతంగా నటించిన నరేన్... ఇపుడు హీరోగా 'ఆత్మ' చిత్రంలో నటించి, ప్రతి ఒక్కరినీ భయపెట్టేందుకు సిద్ధమయ్యాడు. ఈ సినిమా షూటింగ్ మొత్తం దుబాయ్‌లో జరుకున్న తొలి తమిళ చిత్రం కావడం గమనార్హం. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ నిర్మాణ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. సంగీతం మంగల్ సువర్ణన్ - స్వాతి సునీల్ కుమార్.


'ఆత్మ'లో నరేన్

వెట్రిమారన్ చిత్రంలో శాంతిప్రియ



ప్రముఖ దర్శకుడు, జాతీయ అవార్డు గ్రహీత వెట్రిమారన్ ఒక వైపు హీరోలను డైరెక్ట్ చేస్తూనే మరోవైపు సొంతంగా చిత్రాలను నిర్మిస్తున్నారు. ఈ కోవలో ఆయన తెరకెక్కించనున్న చిత్రంలో 80లో ఓ వెలుగు వెలిగిన హీరో రామరాజన్ సరసన నటించిన శాంతిప్రియ ప్రధాన పాత్రను పోషించనున్నారు. గంగై అమరన్ దర్శకత్వంలో వచ్చిన 'ఎంగ ఊరు పాట్టుకారన్'లో చిత్రంలో రామరాజన్ - శాంతిప్రియ కలిసి నటించారు. ఆ తర్వాత తమిళం, తెలుగు, హిందీ బాషల్లో ఆమె పలు చిత్రాల్లో నటించారు. ఒకానొక కాలంలో ఓ వెలుగు వెలిగిన శాంతిప్రియ.. ఆ తర్వాత చిత్ర పరిశ్రమకు దూరమయ్యారు. 'భారత కవికోకిల' సరోజినీ నాయుడు జీవిత చరిత్రను ఆధారంగా చేసుకుని తెరకెక్కనున్న చిత్రంలో శాంతిప్రియ సరోజినీ నాయుడు పాత్రను పోషిస్తున్నారు. ఆ నేపథ్యంలో వెట్రిమారన్ నిర్మాణంలో రూపొందనున్న చిత్రంలో శాంతిప్రియ నటించనున్నారు. ఈ చిత్రానికి వర్షా భరత్ దర్శకుడు. ఇందులో 25 యేళ్ళ నుంచి 55 యేళ్ళ మధ్య వయస్సున్న మహిళగా ఆమె కనిపించనున్నారు. సాధారణంగా సీనియర్ హీరోయన్లు మళ్ళీ రీఎంట్రీ ఇస్తుంటే వారికి అమ్మ, అక్క, వదిన పాత్రలు వరిస్తుంటాయి. కానీ, శాంతిప్రియకు మాత్రం ఏకంగా ప్రధాన పాత్రను పోషించే అవకాశం రావడం గమనార్హం. కాగా, ఈ శాంతిప్రియ ఎవరో కాదు.. సీనియర్ నటి భానుప్రియకు స్వయానా సోదరి.

ఫిల్మ్ సిటీ నిర్మాణ పనులు ప్రారంభం

రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో తమిళ చిత్ర పరిశ్రమకు ఒక ఫిల్మ్ సిటీ నిర్మాణంకానుంది. ప్రభుత్వం నిర్మించే ఈ ఫిల్మ్ సిటీ నిర్మాణ ప్రారంభ పనులు ప్రారంభంకావడం శుభ పరిణామంగా చిత్రపరిశ్రమకు చెందిన ప్రముఖులు అభిప్రాయ పడుతున్నారు. గతంలో స్థానిక తరమణిలో ఎంజీఆర్ ఫిల్మ్ సిటి ఉండేంది. దీనిపక్కనే టైడల్ పార్కు నిర్మాణం జరిగింది. ఈ ఐటీ పార్కు కోసం ఫిల్మ్ సిటీకి చెందిన స్థలాలను ప్రభుత్వం కేటాయిస్తూ వచ్చింది. ఇపుడు ఈ ఫిల్మ్ సిటీలో కొంత స్థలం మాత్రమే ఉంది. ఈ నేపథ్యంలో చిత్రపరిశ్రమ ఆధ్వర్యంలో కలైంజర్ శతవార్షిక వేడుకలను ఈ నెలలో నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సీఎం స్టాలిన్... ప్రభుత్వం తరపున రూ.500 కోట్ల వ్యయంతో ఫిల్మ్ సిటీని నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఆ ప్రకారంగానే ఇపుడు ఫిల్మ్ సిటీ నిర్మాణ ప్రాథమిక పనులు ప్రారంభమయ్యాయి. పూందమల్లికి సమీపంలో ఈ ఫిల్మ్ సిటీ నిర్మితంకానుంది. ఇందుకోసం టెండర్లను సీఎండీకే ఆహ్వానించింది. ఫిబ్రవరి 26వ తేదీ 3 గంటల లోపు టెండర్లు సమర్పించేందుకు చివరి తేదీని నిర్ణయించారు. టెండర్లను ఖరారు చేసిన తర్వాత నిర్మాణ పనులు కూడా ఏమాత్రం ఆలస్యం లేకుండా ప్రారంభించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోనుంది.


ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

'సింగపూర్ సలూన్'లో గెస్ట్ రోల్‌లో లోకేష్-అరవింద్ స్వామి

గోకుల్ దర్శకత్వంలో ఆర్జే బాలాజీ హీరోగా నటించిన కొత్త చిత్రం 'సింగపూర్ సలూన్'. గురువారం విడుదలైంది. ఈ చిత్రంలో యంగ్ సెన్సేషనల్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్, హీరో జీవా, సీనియర్ హీరో అరివింద్ స్వామిలు గెస్ట్ రోల్‌లో కనిపించారు. ఆర్జే బాలాజీ చిత్రలో ఈ ముగ్గురు ఒకనిపించడం ప్రేక్షకులకు సైతం ఆశ్చర్యపరిచింది. నిజానికి ఈ చిత్రంలో లోకేష్ కనకరాజ్, జీవాలు నటించే విషయాన్ని ముందుగానే బహిర్గతం చేశారు. కానీ, అరవింద్ స్వామి నటించారన్న విషయాన్ని మాత్రం సినిమా రిలీజ్ అయ్యేంతవరకు సీక్రెట్‌గా ఉంచి ప్రేక్షకులకు చిత్ర బృందం సర్‌ప్రైజ్ ఇచ్చింది. వివేక్ మెర్విన్ సంగీతం సమకూర్చిన ఈ చిత్రాన్ని వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానరుపై ప్రముఖ నిర్మాత ఐసరి డాక్టర్ కె.గణేశ్ నిర్మించారు. కాగా, గురువారం విడుదలైన చిత్రాల్లో 'సింగపూర్ సలూన్'తో పాటు 'బ్లూస్టార్', 'ముడకర్రాన్', 'తూక్కుదురై' చిత్రాలు ఉన్నాయి.


'సింగపూర్ సలూన్'లో ఓ దృశ్యం

చిత్రజ్యోతి

మదురైలో వైభవంగా మీనాక్షి అమ్మవారి తై తెప్పోత్సవం

చెన్నై, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మదురై నగర సామ్రాజ్ఞి మీనాక్షి అమ్మవారి ఆలయ తైమాస తెప్పోత్సవం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకలలో వేలాదిమంది భక్తులు పాల్గొన్నారు. ప్రతియేటా మీనాక్షి అమ్మవారి ఆలయంలో తై మాస ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. ఆ మేరకు ఈ యేడాదికి సంబంధించి తై మాస ఉత్సవాలు ఈ నెల 14న ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం మీనాక్షి అమ్మవారు, సుందరేశ్వరర్ స్వామివారు వివిధ వాహనసేవల ద్వారా చిత్తిరై వీధులలో ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ నేపథ్యంలో మంగళవారం మారియమ్మన్ ఆలయం తెపోత్సవ ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. బుధవారం స్వర్ణపల్లకీలో స్వామి, అమ్మవారు వేంచేసి ఆయనుండి బయలుదేరి అమ్మవారి సన్నిధి, కామరాజర్ వీధి మీదుగా చింతామణిలో ఉన్న వరికంకులుకోసే మండపంలో కొలువుదీరారు. ఆ తర్వాత కోతకోయు ఉత్సవం నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో అత్యంత కీలకఘట్టమైన తెప్పోత్సవం గురువారం ఉదయం జరిగింది. ముందుగా వేకువజామునే మీనాక్షి అమ్మవారి ఆలయాన్ని తెరిచి స్వామి, అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేకువజాము ఐదు గంటలకు వెండి తొట్టిలో, వెండి సింహాసనంపై అమ్మవారు ఆశీనులయ్యారు. అమ్మవారి వెనుకే సుందరేశ్వరర్ స్వామివారు కూడా వేంచేశారు. అటు పిమ్మట ఆయం నుండి బయలుదేరి అమ్మవారిసన్నిధి, విళక్కుతూన్, కీళ్‌వాసల్, కామరాజర్‌రోడ్డు మీదుగా మదురై వండియూరు మారియమ్మన్ కొలను ప్రాంతానికి వేంచేవారు. ఆ తీర్థ కొలనులో అందంగా అలంకరించిన తెప్పపై ఉదయం 10.40 గంటలకు మీనాక్షి, సుందరేశ్వరర్ స్వామి ఆశీనులై ఊరేగారు. ఈ వేడుకలను తిలకించేందుకు రాష్ట్రం నలుమూలల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు. గురువారం రాత్రి కూడా ఆ తీర్థకొలనులో జరిగిన రెండో విడత తెప్పోత్సవానికి కూడా వేల సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



వండియూరు మారియమ్మన్ ఆలయ తీర్థకొలనులో తెపోత్సవాన్ని నలువైపులా నిలిచి తిలకిస్తున్న భక్తులు

నేడు తిరుచ్చిలో డీపీఐ మహానాడు

పార్లమెంటు భవనం నమూనాతో మహానాడు వేదిక

ప్యారీస్, జనవరి 25: దళిత్ పాంథర్స్ ఆఫ్ ఇండియా (డీపీఐ) ఆధ్వర్యంలో 'ప్రజాస్వామానిదే విజయం' పేరుతో తిరుచ్చి సిరగనూరులో ముప్పెరుం విళా శుక్రవారం జరుగనుంది. ముఖ్యమంత్రి స్టాలిన్, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున కర్గే, సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా సహా ఇండియా కూటమికి చెందిన నాయకులు, రాష్ట్ర మంత్రులు కేఎన్ నెహ్రూ, అన్బిల్ మహేష్, శివశంకర్, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నారు. సాయంత్రం 4 గంటలకు డీపీఐ ఎంపీ తిరుమావళవన్ అధ్యక్షతన జరుగనున్న మహానాడు వేదిక ప్రాంగణాన్ని గురువారం డీఐజీ తిరునావుక్కరసు, సీఎం సెక్యూరిటీ విభాగం ఐజీ కార్తికేయన్ తదితర ఉన్నతాధికారులు పరిశీలించారు. ప్రముఖుల రాక సందర్భంగా సిరగనూరు ప్రాంతంలో గురు, శుక్రవారాల్లో ట్రాఫిక్ మార్పులు చేయడంతో పాటు డ్రోన్లు ఎగురవేసేందుకు నిషేధం విధించారు.

కోలాహలంగా తైపూసం వేడుకలు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవమూర్తులు - రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వాములు ఆలయ తైపూసం వేడుకల్లో పాల్గొన్న భక్తులు



వేలూరు, జనవరి 25: తైపూసం సందర్భంగా జిల్లాలోని పలు ఆలయాల్లో జరిగిన వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివార్లను దర్శించుకున్నారు. రత్నగిరి బాలమురుగన్ అడిమై స్వాములు ఆలయంలో జరిగిన వేడుకల్లో బాలమురుగన్, వల్లి, దేవయాని అమ్మవార్లకు సుగంధద్రవ్యాలతో అభిషేకం, అలంకారం చేసి, దీపారాధనలు నిర్వహించారు. అనంతరం అలంకరించిన వెండి రథంలో ఉత్సవమూర్తులను ఆశీనులు చేసి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. తొలుత రత్నగిరి ఆలయం ముందుగా ఉన్న వినాయకుడికి బంగారు కవచంతో ప్రత్యేక అలంకారం చేశారు. భక్తులు కావళ్ల మోసుకుంటూ వచ్చి మొక్కలు తీర్చుకున్నారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

- షోలింగర్ సుబ్రమణ్యస్వామి ఆలయంలో తైపూసం సందర్భంగా ప్రత్యేక అభిషేకం, వాలాజా మురుగన్ ఆలయంలో పాలబిందెల ఊరేగింపు, ఉత్సవమూర్తులకు క్షీరాభిషేకం నిర్వహించి, ప్రత్యేకంగా అలంకరించారు.
- బాణవరం సమీపం వేడన్‌తాంగల్ గ్రామంలో సుబ్రమణ్యస్వామి, వల్లి, దేవసే సమేత ఉత్సవమూర్తులకు పాలు, పెరుగు, తేనె, చందనం, పంచామృతం, సుగంధద్రవ్యాలతో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. వేడుకల్లో నెమిలి, షోలింగర్, భానావరం సహా 25కు పైగా గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని స్వామి దర్శనం చేసుకున్నారు.
- స్థానిక జలకంఠేశ్వర స్వామి ఆలయంలో వల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యస్వామికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారం, పూజలు, దీపారాధనలు నిర్వహించారు. అలాగే, కాట్పాడి సమీపం వల్లిమలైలోని సుబ్రమణ్యస్వామి, కాగితపుపట్టరై సైదాపేటలోని బాలదండాయుధపాణి ఆలయాల్లో జరిగిన తైపూ సం వేడుకల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.